# ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు





జాతీయ తెలుగు దినపత్రిక



# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం, ఆగస్టు 17, 2026 | పేజీలు :4




# అంగన్వాడీ పోస్టుల పేరుతో దందా?

- -రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం
- -పైస్థాయిలో సంబంధాలు ఉన్నాయంటూ అభ్యర్థులకు మభ్యపెడుతున్న దళారులు
- -మెరిట్‌కు మంగళం..! -డబ్బులిస్తే పోస్టు ఇప్పిస్తామంటూ హామీలు?
- -దళారుల వసూళ్లకు చెక్ పడేనా..
- -అర్హులకు న్యాయం జరిగేనా?
- -అధికారులు స్పందించేనా!



ఇల్లందు, ఆగస్టు 16 (ప్రజా జ్యోతి)

జిల్లాలో ఇటీవల విడుదలైన అంగన్వాడీ టీచర్లు, ఆయాల పోస్టుల నియామకానికి సంబంధించి నోటిఫికేషన్ అనంతరం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ కూడా పూర్తవడంతో అభ్యర్థులు ఇంటర్వ్యూల కోసం ఎదురుచూస్తున్నారు. దీనినే ఆసరాగా చేసుకుని కొందరు దళారులు వసూళ్లకు తెరలేపుతున్నారనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. పోస్టులు ఇప్పించేందుకు తమకు పైస్థాయిలో పరిచయాలు, సంబంధాలు ఉన్నాయని కొందరు అభ్యర్థులను నమ్మించే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. దీంతో అంగన్వాడీ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. అభ్యర్థుల ఆరోపణల ప్రకారం అంగన్వాడి టీచర్ పోస్టు ఇప్పిస్తామని చెప్పి సుమారుగా రూ. 2 లక్షల నుండి రూ. 3 డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ లో రిజర్వేషన్, అర్హత ప్రమాణాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, రిజర్వేషన్ వర్తించని వారు, స్థానికత లేని వారిని కూడా మీకే ఉద్యోగం వస్తుంది అంటూ ఆశ చూపించి ఆన్లైన్ దరఖాస్తులు చేయించి డబ్బులు వసూలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతుంది. దీంతో అమాయక మహిళ అభ్యర్థులను నమ్మించి భారీ మొత్తంలో డబ్బును గుంజేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని చర్చ జోరుగా సాగుతుంది. నిజంగా మెరిట్, అర్హతల ఆధారంగా దరఖాస్తు చేసుకున్న మహిళలలో ఆందోళన నెలకొంది. పారదర్శకంగా జరగాల్సిన నియామక ప్రక్రియపై ఇలాంటి ప్రచారాలు జరగడంతో అభ్యర్థుల్లో అనుమానాలకు తావిస్తున్నాయని

# అంగన్వాడీ పోస్టుల పేరుతో దందా?

పలువురు అభిప్రాయపడుతున్నారు. అర్హత, మెరిట్ ఉన్న మహిళలకు ఎలాంటి అన్యాయం జరగకుండా నియామకాలు నిర్వహించాలని వారు కోరుతున్నారు. ఉద్యోగాల పేరుతో డబ్బులు డిమాండ్ చేసే మధ్యవర్తులపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని, నియామక ప్రక్రియపై అధికారికంగా స్పష్టమైన ప్రకటన విడుదల చేసి అభ్యర్థులను అప్రమత్తం చేయాలని పలువురు కోరుతున్నారు. ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలని అభ్యర్థిస్తున్నారు.

పోస్టుకొక రేటు?

అంగన్వాడీ పోస్టులకు ఒక్కో పోస్టుకు ప్రత్యేకంగా రేటు నిర్ణయించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాంతాన్ని, పోస్టు ప్రాధాన్యతను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. అయినప్పటికీ ఈ తరహా ప్రచారం అభ్యర్థులను అయోమయానికి గురిచేస్తోంది.

పైస్థాయిలో పరిచయాలంటూ..

తమకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర కీలక వ్యక్తులతో పరిచయాలు ఉన్నాయని చెబుతూ కొందరు అభ్యర్థులను మభ్యపెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. డబ్బులు చెల్లిస్తే పోస్టు వచ్చేలా చూస్తామని హామీలు ఇస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. దీంతో అసలు నిబంధనల ప్రకారం ఎంపిక జరుగుతుందా? లేక ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

మెరిట్‌కు మంగళం?

అంగన్వాడీ పోస్టులకు అర్హత ఉన్న అభ్యర్థులు తమ విద్యార్హతలు, స్థానికత తదితర నిబంధనల ఆధారంగా పారదర్శకంగా ఎంపిక జరుగుతుందని ఆశిస్తున్నారు. అయితే డబ్బులు ఇస్తే పోస్టులు ఇప్పిస్తామంటూ కొందరు చేస్తున్న ప్రచారం నిజమైతే మెరిట్ ఆధారిత ఎంపికపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరగకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డబ్బులిస్తే పోస్టు..?

పోస్టు కోసం డబ్బులు సమర్పించుకోవాలని కొందరు ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు మరింత కలవరపెడుతున్నాయి. ఉద్యోగం కోసం కుటుంబ సభ్యులు అప్పులు చేసి డబ్బులు సమకూర్చుకునే పరిస్థితి రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి వ్యవహారాల్లో అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

దళారుల వసూళ్లకు చెక్ పడేనా?

అంగన్వాడీ పోస్టుల భర్తీ ప్రక్రియలో దళారుల ప్రమేయం ఉందనే ఆరోపణలు నిజమైతే వారిపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ వినిపిస్తోంది. పోస్టులు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తులపై నిఘా పెట్టి, ఆధారాలు లభిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు కోరుతున్నారు.

అర్హులకు న్యాయం జరిగేనా?

అంగన్వాడీ పోస్టుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించి అర్హులైన అభ్యర్థులకు మాత్రమే అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు. దళారుల మాటలు నమ్మి డబ్బులు కోల్పోకుండా అభ్యర్థులు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. పోస్టుల భర్తీపై స్పష్టమైన సమాచారం, ఎంపిక విధానం, మెరిట్ వివరాలను అధికారులు బహిరంగంగా వెల్లడించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

అధికారుల స్పందించేనా?

అంగన్వాడీ పోస్టుల పేరుతో జరుగుతున్నట్లు ప్రచారం అవుతున్న వసూళ్ల వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, అర్హత ఉన్న ప్రతి అభ్యర్థికి న్యాయం జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

కేసప్పగూడెం--ఉట్లపల్లి మధ్య ఘోర రోడ్డు ప్రమాదం

అశ్వరావుపేట ఆంధ్రజ్యోతి ఆగస్టు 16

అశ్వరావుపేట: కేసప్పగూడెం--ఉట్లపల్లి మధ్య ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరిని ట్రాక్టర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.
ఈ ప్రమాదంలో మల్లం నాగరాజు (25), తండ్రి వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. మోటార్‌సైకిల్ వెనుక కూర్చున్న సోయం నాగరాజు (26), తండ్రి వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రహదారిపై మళ్లీ రక్తసిక్తం అయింది

ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో యువకుడు మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ల వేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, రహదారి భద్రతా నిబంధనల అమలుపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ప్రమాదాలకు అడ్డుకట్ట ఎప్పుడు?
కేసప్పగూడెం--ఉట్లపల్లి మార్గంలో వాహనాల రాకపోకలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదానికి అసలు కారణాలను పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.
ప్రమాదం జరిగిన తీరుపై పోలీసులు దర్యాప్తు చేపట్టి పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

## గిరిజన దర్బార్‌కు యూనిట్ అధికారులు సకాలంలో హాజరు కావాలి

భద్రాచలం ఆగస్టు 16భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం, ఆగస్టు 17న నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజనులు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులను అందజేయాలని కోరారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.గిరిజన దర్బార్‌లో పాల్గొనే సంబంధిత యూనిట్ అధికారులు ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో హాజరు కావాలని ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ స్పష్టం చేశారు. అధికారులు సకాలంలో హాజరై గిరిజనుల సమస్యలను స్వీకరించి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు.

# కార్పొరేషన్ కార్మికుడు జైత్రామ్ మృతి బాధాకరం

### బాధిత కుటుంబానికి అండగా ఉంటాం
### వారసత్వ ఉద్యోగం, పరిహారం, బెనిఫిట్స్ త్వరగా అందేలా చూడాలి
### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం ఆగస్టు 16

విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతూ మున్సిపల్ కార్మికుడు భూక్యా జైత్రామ్ మృతి చెందడం బాధాకరమని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంగపేట 23వ డివిజన్‌కు చెందిన మల్టీ పర్పస్ కార్మికుడు జైత్రామ్ విద్యుత్ దీపాలు అమర్చుతూ స్తంభంపై నుంచి జారిపడి తీవ్ర గాయాలపాలైన సంగతి తెలిసిందే. ఖమ్మంలోని మమత జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారని తెలియడంతో ఎమ్మెల్యే తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సుజాత, మేయర్ మూడ్ గణేష్‌లతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మరణించిన కార్మికుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలవాలని, ప్రభుత్వం, మున్సిపల్ శాఖ ద్వారా తక్షణ ఆర్థిక పరిహారం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి అర్హతను బట్టి ఉద్యోగం కల్పించేలా వేగవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా కార్మికుడికి రావాల్సిన అన్ని రకాల టెర్మినల్ బెనిఫిట్స్ ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన కుటుంబ సభ్యులకు అందేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. బాధితుడి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

జైత్రామ్ కుటుంబానికి అండగా ఉంటాం

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా

కొత్తగూడెం కార్పొరేషన్ కార్మికుడు భూక్యా జైత్రామ్ మృతి చెందడం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. విధి నిర్వహణలో గాయలపాలెం చికిత్స పొందుతున్న జైత్రామ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ ఆదివారం ఖమ్మం మమత ఆసుపత్రికి చేరుకుని జైత్రామ్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్మికుడి అకాల మరణం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు.
నివాళులు అర్పించిన వారిలో కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి గెద్దాడు నగేష్, కార్పొరేటర్లు బోయిన విజయ్ కుమార్, బండి నరసింహ, ధనరాజ్, దినేష్ తదితరులు తదితరులు ఉన్నారు.



# రాష్ట్ర స్థాయి ర్యాంకులతో రాణిస్తున్న మైనారిటీ బాలికల కళాశాల

## వరుసగా 100 శాతం ఫలితాలు
## ఉత్తమ ప్రిన్సిపాల్‌గా బీపాషకు ప్రతిభా పురస్కారం

**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 16,(ప్రజా జ్యోతి)**
విద్యార్థినుల విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ వరుసగా ఉత్తమ ఫలితాలు సాధిస్తూ పాల్వంచలోని టీజీఎంఆర్‌జేసీ కొత్తగూడెం బాలికల కళాశాల--1 విద్యారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. వరుసగా 100 శాతం ఉత్తీర్ణతతో పాటు రాష్ట్ర స్థాయిలో ర్యాంకర్లు సాధిస్తూ సత్తా చాటుతోంది. 2022లో అవుట్‌సోర్సింగ్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.కె.బీపాషా ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరుస్తున్నారు. 2023లో ఎండి. హీనా కౌసర్ 470 మార్కులకు గాను 460 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంక్ పొందారు. 2024లో ఎ.శ్వేత 464/470 మార్కులతో, 2025లో ఎం.డి. అఫియా 466/470, టి. శ్వేత 464/470, ఎస్.కె. అంజుమ్ కౌసర్ 463/470 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. అదేవిధంగా ఈ ఏడాది ఎస్.కె. రంజాన్ బీ 440 మార్కులకు గాను 438 మార్కులతో రాష్ట్ర ప్రథమ ర్యాంక్ సాధించగా, 2026లోఎస్.కె. ఫరాహానా సుల్తానా 430/440 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంక్, ద్వితీయ సంవత్సరంలో ఎస్.కె. రంజాన్ బీ:990/1000
పి.రిహానా బేగం : 978/1000
ఎండి. అఫియా: 989/1000.
ఎండి.అల్ఫియా కౌనీన్:975/1000 రాష్ట్ర స్థాయి ర్యాంక్‌లను సాధించారు. విద్యార్థినులకు ప్రత్యేక బోధన, నిరంతర మూల్యాంకనం, పోటీ పరీక్షలకు సన్నద్ధత, కెరీర్ మార్గదర్శకత్వంపై కళాశాల యాజమాన్యం ప్రత్యేక



దృష్టి సారిస్తోంది. దీంతో పలువురు విద్యార్థినులు ఇంజనీరింగ్, వైద్యంతో పాటు వివిధ ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలు పొందుతున్నారు. కళాశాల విద్యా ప్రగతి, విద్యార్థినుల విజయాలు, సంస్థ అభివృద్ధికి అందించిన సేవలను గుర్తిస్తూ ప్రిన్సిపాల్ ఎస్.కె. బీపాషాకు "ఉత్తమ ప్రిన్సిపాల్" ప్రతిభా పురస్కారం లభించింది. జిల్లా కలెక్టర్ అంకిత్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు.
ఈ విజయాలు తన వ్యక్తిగత కృషి మాత్రమే కాదని, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు, తల్లిదండ్రుల సమష్టి కృషి ఫలితమని బీపాషా తెలిపారు. "ఈ విజయం టీజీఎంఆర్‌జేసీ కొత్తగూడెం గర్ల్స్--1 సంస్థ మొత్తానికే చెందుతుంది" అని ఆమె పేర్కొన్నారు.

# ఘనంగా వాజపేయి వర్ధంతి



**చర్ల, ఆగస్టు 16 :(ప్రజా జ్యోతి):**
చర్ల మండల భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజపేయి వర్ధంతి వేడుకలను ఉప్పరగూడెం 63వ బూత్‌తో పాటు మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు వాజపేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మండల అధ్యక్షుడు నూప రమేష్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ భారత రాజకీయాల్లో అటల్ బిహారీ వాజపేయి అజాతశత్రువుగా, మహోన్నత నాయకుడిగా నిలిచారని కొనియాడారు. ప్రధానమంత్రిగా దేశాభివృద్ధికి మౌలిక వసతుల కల్పనకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. పోఖ్రాన్ అణు పరీక్షల ద్వారా భారతదేశ సార్వభౌమాధికారాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని వాజపేయి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బి.సందీప్, కార్యదర్శి ముత్తవరపు శ్రీనివాస్, చారి విశ్వనాథ్, యువ మోర్చా నాయకుడు పి.వినయ్, బీజేపీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన పి.సౌజన్య, మచ్చ వేణు, కల్లూరి సిద్ధార్థ, సంపత్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పాతపాల్వంచ మైసమ్మతల్లి దేవాలయంలో ఘనంగా శ్రావణమాస బోనాల మహోత్సవం

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ విమలాదేవి దంపతులు



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 16 ,(ప్రజా జ్యోతి)**
పాతపాల్వంచ లోని గడియకట్ట ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన దేవాలయంగా కీర్తించబడుతున్న మైసమ్మ తల్లి దేవాలయం లో శ్రావణ మాసపు బోనాలు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసపు మొదటి ఆదివారం నిర్వహించే బోనాల కార్యక్రమాన్ని ఆదివారం కనులపండుగగా నిర్వహించారు. దేవాలయం పూజారులు పురాణం పవన్ శర్మ శాస్త్రి, పురాణం సుమన్ శాస్త్రిల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసారు. ?ఈ ప్రత్యేక పూజల్లో డిసిఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ చైర్మన్



కొత్వాల శ్రీనివాసరావు, పాతపాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పాతపాల్వంచ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు తమతమ ఇంటి నుండి బోనాలు ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతోపాటు కొత్వాల బోనమెత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు.
అమ్మదయ వుంటే అంతా శుభమే జరుగుతుంది
అమ్మలకన్న అమ్మదయ వుంటే అంతా శుభమే జరుగుతుందని కొత్వాల అన్నారు. అమ్మను పూజిస్తే సకల పాపాలు తొలగిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాతపాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కోత్వాల విమలాదేవి, మాజీ కౌన్సిలర్ కొత్వాల సత్యనారాయణ, శ్రీమైసమ్మతల్లి దేవాలయం కమిటీ సభ్యులు వంగా రమేష్, మసనం శరత్, కోసూరి కిరణ్, రౌతు మల్లేష్, కరుకుల సతీష్,గడదేశి వెంకటేష్, పాశం నాసరయ్య,బర్ల పాపారావు, ముత్యాల కోటేశ్వరరావు, బొందిల శేషగిరి, కొండపల్లి నాగరాజు, దుర్గా రావు, వజ్జల రాము, చిన్నపండు, ధర్మరాజుల రమేష్, యాటా బొందిలి బాలాజీ, బండారు తేజలి తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ భూములను పరిరక్షించాలి

## ఆమరణ నిరాహార దీక్షకు న్యాయవాదుల మద్దతు

**చర్ల, ఆగస్టు 16 :(ప్రజాజ్యోతి):**
చర్ల మండలంలోని శ్రీశ్రీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మహా రుద్రసేన వ్యవస్థాపకుడు కొండా చరణ్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఆదివారం ఐదో రోజుకు చేరుకుంది. దీక్షకు భద్రాచలం జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు సీనియర్ అడ్వకేట్లు సాధనపల్లి సతీష్, సిహెచ్. శివ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ భూముల విషయంలో అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఐదు రోజులుగా నిరాహార దీక్ష కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన స్థాయిలో స్పందించకపోవడం బాధాకరమని అన్నారు . దీక్ష చేస్తున్న కొండా చరణ్ ఆరోగ్య పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు.
ఆలయ భూములు, ప్రభుత్వ భూముల విషయంలో ఆక్రమణలకు తావులేకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. భూముల పరిరక్షణకు సంబంధించిన చర్యలు ఎందుకు ఆలస్యమవుతున్నాయో అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ తక్షణమే జోక్యం చేసుకుని ఆలయ భూమిని పరిశీలించి, చట్టపరమైన ప్రక్రియ ద్వారా ఆలయ కమిటీకి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ భూముల వ్యవహారంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోకపోతే సంబంధిత అధికారులపై చట్టపరమైన మార్గాలను ఆశ్రయిస్తామని వారు తెలిపారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన ఈ అంశంపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోక్ రక్షక్ పార్టీ నాయకుడు ఎస్.కె. జహూరుద్దీన్ భాష, మహిళా రక్షక్ సంఘ్ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్. సుజాత, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి


## జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 16,(ప్రజా జ్యోతి)**
నేడు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, ,ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# నా జీవితం ప్రజాసేవకే అంకితం

- ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం
-డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల
-పాత పాల్వంచ లోని కొత్వాల స్వగృహంలో ఘనంగా జన్మదిన వేడుకలు







**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 16 ,(ప్రజా జ్యోతి)**
తన జీవితం ప్రజాసేవకే అంకితమని, ప్రజల సమస్యల పరిష్కారమే తన ధ్యేయం అని డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాత పాల్వంచలోని కొత్వాల స్వగృహంలో ఆదివారం ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం నియోజకవర్గం కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లకు చెందిన పలువురు కార్పొరేటర్లు, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల సర్పంచ్‌లు, వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పలువురు అధికారులు, కొత్వాలను శాలువా, బొకేలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పలువురు కొత్వాలను ప్రశంసలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ తన జీవితాంతం వరకు ప్రజాసేవ చేస్తానన్నారు. తనకు సహకరిస్తున్న అన్ని వర్గాల ప్రజలకు, అధికారులకు ధన్యవాదాలు, కృతజ్ఞతలు అని కొత్వాల అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి,కార్పొరేటర్లు రావి రాంబాబు, కొత్వాల విమలాదేవి, పైడిపల్లి జయలక్ష్మి, డాక్టర్ దీూ రావు, కె. కె. శ్రీను, హోలీ శ్రీను, సీరం సుగుణ, దంతేబోయిన నరేష్, చెరుకు భాగ్యలక్ష్మి, దావుద్, కాంగ్రెస్ నాయకులు కంచర్ల చంద్రశేఖర్ రావు, ఆళ్ల మురళి, కోనేరు చిన్ని, కొత్వాల సత్యనారాయణ, యర్రంశెట్టి ముత్తయ్య, ఊకంటి గోపాలరావు, తూము చౌదరి, కొండం వెంకన్న,పరమేశ్ యాదవ్, చీకటి కార్తీక్,వై. వెంకటేశ్వర రావు(వై.వి), ఎస్.ఎ. జలీల్, సాదం రామకృష్ణ, మండే వీరహనుమంత రావు, పైడిపల్లి మహేష్, కాపర్తి వెంకటాచారి, బాలినేని నాగేశ్వరరావు, కందుకూరి రాము,పాల్వంచ సొసైటీ వైస్ ఛైర్మన్ కాంపెల్లి కనకేష్, ఏనుగుల అర్జున్ రావు, భువన సుందర్ రెడ్డి, ఎస్.వి.ఆర్.కె ఆచార్యులు, చింతా నాగరాజు, శాంతి వర్ధన్, యాకూబ్, చిన్న పండు, నరహరి,దొప్పలపూడి సురేష్, నల్లమల్ల సత్యం, పులి సత్యనారాయణ, కాపా శ్రీను, వాసుమల్ల సుందర్ రావు గంధం నరసింహారావు, దున్నపోతుల రవి,లి తదితరులు పాల్గొన్నారు.

# 35 కుటుంబాలకు దోమతెరల పంపిణీ







**చర్ల, ఆగస్టు 16:(ప్రజాజ్యోతి):**
స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ చర్ల ఆధ్వర్యంలో కుర్నపల్లి పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన 35 ఆదివాసీ కుటుంబాలకు దోమతెరలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆవుల శివప్రసాద్ మాట్లాడుతూ పేద, నిరుపేద ప్రజల సంక్షేమం కోసం క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో అటవీ ప్రాంత గ్రామాల్లో పారిశుధ్య లోపాల కారణంగా మలేరియా, డెంగ్యూ తదితర జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా దోమతెరలను అందిస్తున్నట్లు అన్నారు .ప్రజలు పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళ నిద్రించే సమయంలో దోమతెరలను తప్పనిసరిగా వినియోగించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మురళీధర్ రెడ్డి, శ్రీకర్, రాము, సుకుమార్, వంశీ, హరికృష్ణ, శ్యామ్యూల్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మకు ఘనంగా బోనాలు

## ప్రతీ ఇంటికి తోరణాలతో మొక్కుబడి. కానుకలు, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు



**ఆళ్ళపల్లి,ఆగస్టు16 (ప్రజాజ్యోతి)**
శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఆళ్ళపల్లి, మర్కోడుతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం ముత్యాలమ్మ బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామాల్లో ప్రతీ ఇంటికి మామిడి తోరణాలు కట్టి పండుగ శోభను సంతరించుకున్నారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి నెత్తిన బోనాలు పెట్టుకొని డప్పు మేళాలు, డీజే పాటల నడుమ ఊరేగింపుగా ముత్యాలమ్మ ఆలయానికి చేరుకున్నారు.ఆలయానికి చేరుకున్న మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు, చీరలు తదితర మొక్కుబడి కానుకలు సమర్పించి నైవేద్యాలు పెట్టారు. కొందరు భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు ప్రత్యేక పూజలు, నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామాల్లో సకాలంలో వర్షాలు కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ముత్యాలమ్మను వేడుకున్నారు.బోనాల సందర్భంగా ఆలయ పరిసరాలను శుభ్రం చేసి ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ఉదయం నుంచే ఆలయం వద్ద భక్తుల రాకపోకలతో సందడి నెలకొంది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించడంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక, పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, పిల్లలు, యువత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రావణమాసంలో వైభవంగా గోదావరి మాతకు దివ్య హారతులు

## భక్తి పారవశ్యంతో పులకించిన భక్తజనం

భద్రాచలం ఆగస్టు 16
భద్రాచలం దివ్యక్షేత్రంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని గోదావరి మాతకు దివ్య హారతుల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షులు, పురోహితులు రామ వజ్జల రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గోదావరి కరకట్ట వద్ద నదీహారతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా రామ వజ్జల రవికుమార్ మాట్లాడుతూ శ్రావణమాసం ఆదిపరాశక్తి, శ్రీమాతలకు ఎంతో విశేషమైన మాసమని అన్నారు. ఈ మాసంలో నిర్వహించే పుణ్యకార్యాల వల్ల వరలక్ష్మీదేవి, మంగళగౌరీ మాతల అనుగ్రహంతో ప్రజలకు సర్వసౌభాగ్యాలు, ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలుగుతాయని పేర్కొన్నారు. శ్రావణమాసంలో గోదావరి మాతకు సమర్పించే హారతుల వల్ల ప్రజలకు, ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాలకు అన్ని రంగాల్లో అభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు.
శ్రావణమాసం శుక్లపక్ష చవితి రోజున భద్రాద్రిలో నిర్వహించిన గోదావరి హారతి ఎంతో విశిష్టమైనదని తెలిపారు. అనంతరం పురోహితులు గోదావరి హారతి విశిష్టతతో పాటు శ్రావణమాస చవితి ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా గణపతి పూజ, దీపోత్సవం నిర్వహించారు. భక్తులచే దీపాలను వెలిగించి గోదావరి మాతకు పూజా ద్రవ్యాలతో అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. లోకకల్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ మహత్కార్యంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామానుగ్రహంతో గోదావరి మాత ఆశీస్సులు పొందుతున్నారని రామ వజ్జల రవికుమార్ తెలిపారు.